సాక్షి
కృష్ణాజిల్లా
బుధవారం । 31 । జూలై । 2024




మర్యాద పూర్వక కలయిక

విజయవాడస్పోర్ట్స్: సీపీ రాజశేఖరబాబును ఎమ్మెల్సీ రుహుల్లా, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, అవినాష్ మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిశారు.



మానవ అక్రమ రవాణా నేరం

పటమట(విజయవాడతూర్పు): మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని ఎన్టీ ఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. ఇందుకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు.



ఫుడ్ కోర్టులో తమ్ముళ్ల దందా

నగరంలోని ఐజీఎంసీ స్టేడియం వద్ద ఫుడ్ కోర్టులో తెలుగు తమ్ముళ్లు దందా చేస్తున్నారు. చిరు వ్యాపారులను వేధిస్తున్నారు.

▸8లో

న్యూస్‌రీల్

ఇన్‌స్పైర్‌మనక్‌లో పాల్గొనండి

- అవార్డులు సాధించండి
- డీఈవో తాహెరాసుల్తానా



చిలకలపూడి(మచిలీపట్నం): ఇన్‌స్పైర్ మనక్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని అవార్డులు సాధించి జిల్లాను అగ్రగామిగా నిలపాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా అన్నారు. ఆమె మంగళవారం తన కార్యాలయంలో ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్లను ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ గత ఏడాదిలాగానే ఈ సంవత్సరం కూడా అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని రాష్ట్రంలో జిల్లాను మొదటి మూడు స్థానాల్లో నిలబెట్టాలన్నారు. అంతేకాకుండా జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం పొందాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క పాఠశాల నుంచి విధిగా ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో డీఈవోతో పాటు డీఈవో కార్యాలయ ఏడీ అజీజ్, డీవైఈవో ప్రసాద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

డీఆర్వో చంద్రశేఖరరావు



చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఏపీపీఎస్సీ, పోలీస్, మెడికల్, విద్యుత్ శాఖాధికారులకు సంబంధించి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. పెనమలూరు మండలం కానూరు గ్రామంలోని అయాన్ డిజిటల్ టెక్నాలజీస్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించండి

కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పింఛన్ల పంపిణీపై మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో పింఛన్ల పంపిణీపై తీసుకున్న చర్యలను కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. ఆగస్టు నెలకు సంబంధించి 2,40,939 మందికి రూ. 102.16 కోట్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. 1వ తేదీనే 96 శాతం పంపిణీ, 2వ తేదీన నూరుశాతం పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత నెలలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ ఇన్‌చార్జ్ పీడీ నాగేశ్వరనాయక్, జెడ్పీ సీఈవో ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు ఏపీటీడీసీ డైలీ ప్యాకేజీ టూర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): తిరుమలలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) డైలీ ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు సంస్థ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల టూర్‌లో భాగంగా ప్రతి రోజూ రాత్రి 11 గంటలకు విజయవాడ బెంజిసర్కిల్ (ఫ్లై ఓవర్ పిల్లర్ నంబర్ 4)వద్ద నుంచి బస్సు బయలుదేరి మరునాడు ఉదయం 6 గంటలకు శ్రీకాళహస్తికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడ ఏర్పాటు చేసే వసతి గృహంలో ఫ్రెషప్ అయిన తరువాత బ్రేక్‌ఫాస్ట్ అనంతరం బయలుదేరి ఉదయం 10 గంటలకు తిరుమలకు చేరుకుని శ్రీవారి దర్శనం చేయిస్తారని, తరువాత మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. భోజనం చేసిన తరువాత తిరుచానూరు తీసుకువెళ్లి పద్మావతి అమ్మవారి దర్శనం చేయిస్తామన్నారు. అక్కడ నుంచి బయలుదేరి రాత్రి 7 గంటలకు శ్రీకాళహస్తి చేరుకుని అక్కడ రాత్రి భోజనం చేసిన తరువాత తిరిగి విజయవాడకు బయలుదేరుతుందని చెప్పారు. తిరుమల టూర్ ప్యాకేజీకి పెద్దలకు రూ.3,970, పిల్లలకు రూ.3670 ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 98480 07025, 94402 51775, 0866 – 2571393 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రద్దీ: కిటకిటలాడుతున్న ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ బోగీ



ఆదాయ పట్టాలపై లాభాల కూతే లక్ష్యం.. సౌకర్యాల కల్పనపై అంతులేని నిర్లక్ష్యం.. ప్రయాణికుల కష్టాలు పట్టని వైనం.. ఇదీ ప్రస్తుతం రైల్వే శాఖ అనుసరిస్తున్న విధానం. సాధారణ ప్రజలు ప్రయాణించే జనరల్ కోచ్‌లను అడ్డగోలుగా కుదించింది. టికెట్లను మాత్రం వేలాదిగా విక్రయిస్తోంది. తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణం చేయొచ్చన్న ఆశతో టిక్కెట్లు తీసిన సాధారణ ప్రయాణికులకు పట్టపగలే చుక్కలు చూపిస్తోంది. కుటుంబ సభ్యుల కేరింతల నడుమ సంతోషంగా సాగాల్సిన వారి ప్రయాణాన్ని అగమ్యగోచరంగా మారుస్తోంది.

జనరల్ ప్రయాణం

అగమ్యగోచరం..



దేంజర్ : గేటువద్ద వేలాడుతున్న ప్రయాణికులు

- గతం కంటే తగ్గిపోయిన జనరల్ బోగీలు
- రెండు బోగీలకే వేలల్లో టికెట్ల జారీ
- ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ బోగీలు కిటకిట
- సాధారణ ప్రయాణికులపై రైల్వే శాఖ చిన్నచూపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నిన్న, మొన్నటి వరకూ పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉన్న రైల్వే ప్రయాణం నేడు భారంగా మారింది. సేవా దృక్పథంతో సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులను అతి తక్కువ ఖర్చుతో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ వచ్చిన భారతీయ రైల్వే దేశంలోనే అతిపెద్ద రవాణా వ్యవస్థగా ప్రజల మన్ననలు అందుకుంది. ప్రస్తుతం ఆదాయమే లక్ష్యంగా పట్టాలపై లాభాల కూతపెడుతోంది. ఇది సామాన్య ప్రజలు ఎక్కువగా ప్రయాణం చేసే పలు ప్యాసింజర్ రైళ్లను పూర్తిగా రద్దు చేసింది. మరి కొన్నింటిని ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి చార్జీలు పెంచింది. సాధారణ, మధ్య తరగతి ప్రజలకు రైలు ప్రయాణాన్ని దూరం చేస్తోంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గతంలో ఉన్న జనరల్ కోచ్‌ల సంఖ్యను భారీగా కుదించింది. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గతంలో ఐదారు జనరల్ బోగీలు ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్యను రెండుకు కుదించింది. మరో వైపు స్లీపర్ కోచ్‌లను కూడా క్రమంగా కుదిస్తూ ఏసీ కోచ్‌లను పెంచుతోంది. నిన్నమొన్నటి వరకు స్లీపర్ కోచ్‌లో ప్రయాణించే వారు ఏసీ చార్జీల భారం భరించలేక జనరల్ బోగీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో జనరల్ బోగీలపై మరింత భారం పడింది. కూర్చునే మాట అటుంచి నిలబడేందుకు సైతం వీలు లేకుండా, కనీసం ఊపిరి పీల్చుకునే పరిస్థితి లేకుండా ఈ బోగీలు కిక్కిరిసిపోతున్నాయి. జనరల్ బోగీల్లో ప్రయాణం సామాన్యులకు నరకం చూపిస్తోంది.



ప్రమాదకరం : గేటువద్ద పిల్లలతో ప్రయాణం

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో మరీ దారుణం

నిత్యం ప్రయాణికులతో రద్దీగా నడిచే రైళ్లలో విశాఖపట్నం – ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519 / 18520) ఒకటి. దీనికి ముందు విశాఖ వాసులు ముంబై వెళ్లేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే అందుబాటులో ఉండేది. ఆ రైలు భువనేశ్వర్ నుంచే కిటకిటలాడుతూ విశాఖపట్నం వచ్చేది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు కేంద్రం 2010 మార్చి 24 నుంచి వారంలో రెండు రోజులు నడిచేలా 12749/12750 నంబర్లతో విశాఖపట్నం – ముంబై ఎల్‌టీటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించింది. ఈ రైలులో 22 కోచ్‌లు ఉండేవి. ఎస్‌ఎల్‌ఆర్ రెండు, జనరల్ ఐదు, స్లీపర్ క్లాస్ పది, థర్డ్ ఏసీ మూడు, సెకండ్ ఏసీ, ఫస్ట్ ఏసీ ఒక్కొక్కటి ఉండేవి. దీంతో ఈ రైలుకు విపరీతంగా ప్రజాదరణ లభించి డైలీ సర్వీసుగా మార్చాలని డిమాండ్ పెరిగింది. దీంతో 2013 సెప్టెంబర్ 10 నుంచి 18519/18520 నంబర్లతో డైలీ ఎక్స్‌ప్రెస్ సర్వీసుగా మార్చారు. ప్రారంభంలో ఐదు జనరల్ కోచ్‌లు ఉండగా క్రమేణా వాటిని రెండుకు కుదించారు. దీంతో సాధారణ ప్రయాణికులకు కష్టాలు మొదలయ్యాయి. స్లీపర్ కోచ్‌లను పది నుంచి ఆరుకు పరిమితం చేశారు. వాటిలో ప్రయాణించే వారు కూడా జనరల్ కోచ్‌లను ఆశ్రయిస్తున్నారు. జనరల్ కోచ్‌లను కుదించడంతో మొదలైన ప్రయాణికుల కష్టాలు స్లీపర్ కోచ్‌లను తగ్గించడంతో రెట్టింపయ్యాయి. రైలు ప్రయాణం అంటేనే భయపడేలా చేస్తున్నాయి.



దుర్భరం : మరుగుదొడ్ల వద్ద నేలపై కూర్చుని..

కాలు కదిపే వీలు లేదు



విశాఖపట్నం–ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో నలుగురు కుటుంబ సభ్యులం విశాఖపట్నం నుంచి విజయవాడకు జనరల్ బోగీలో ప్రయాణించాం. బోగీలో కూర్చోవడం కాదు కదా నిలబడి కాలు కదిపేందుకు కూడా వీలులేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. మహిళలు టాయిలెట్‌కు వెళ్లే అవకాశం కూడా లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ప్రయాణం చేసే జనరల్ కోచ్‌ల సంఖ్యను రైల్వే అధికారులు పెంచితే బాగుంటుంది.

– అఖిలేష్, ప్రయాణికుడు, విశాఖపట్నం

జనరల్ కోచ్‌లు పెంచాలి



మహిళలు, పిల్లలతో జనరల్ కోచ్‌లో ప్రయాణం నరకాన్ని తలపించింది. కూర్చోవడానికి స్థలం లేదు. లగేజీ పెట్టుకునేందుకు అవకాశం లేక రైలు ప్రయాణం అంటేనే భయపడే పరిస్థితులు దాపురించాయి. ముంబై వెళ్లేందుకు విశాఖపట్నంలో కుటుంబంతో కలసి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కాం. రద్దీలో ప్రయాణం చేయలేక విజయవాడ రైల్వేస్టేషన్‌లో దిగిపోయాం. రైల్వేశాఖ స్పందించి జనరల్ కోచ్‌ల సంఖ్యను పెంచడంతో పాటు సదుపాయాలను కల్పిస్తే బావుంటుంది.

– హమిబా, ప్రయాణికురాలు, ముంబై

జనరల్ కష్టాలు ఇవీ..

- ఒక్కొక్క జనరల్ కోచ్‌లో సుమారు 100 మంది సౌకర్యవంతంగా ప్రయాణించొచ్చు. అయితే మూడు నాలుగు వందల మంది ప్రయాణించాల్సి వస్తోంది.
- సీట్ల మధ్య ఖాళీ కూడా ప్రయాణికులతో నిండిపోవడంతో ఆయా కోచ్‌లలో కాలు కదపలేని పరిస్థితి ఏర్పడుతోంది.
- లగేజీకి కేటాయించిన స్థలం కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోవడంతో ఊపిరాడని పరిస్థితి నెలకొంటోంది.
- ప్రమాదమని తెలిసినప్పటికీ బాత్‌రూమ్‌లు, బోగీ మెట్ల వద్ద పిల్లలతో కూర్చుని పెద్దలు ప్రయాణించాల్సి వస్తోంది.
- కిక్కిరిసిన కోచ్‌లో మలమూత్ర విసర్జనకు బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి దాపురిస్తోంది. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది.



కిటకిట : రద్దీగా ఉన్న బోగీలోకి ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న ప్రయాణికులు



అపరిశుభ్రం : వాష్‌బేసిన్ వద్ద పరిస్థితి ఇదీ..



జాగా ఏదీ : లగేజీ స్థలంలో కూర్చున్న ప్రయాణికుడు

రైతులకు ఉపయోగపడేలా నిర్ణయాలు

- సాగర్ నుంచి పులిచింతలకు 10 టీఎంసీల నీరు విడుదలయ్యేలా చర్యలు
- కృష్ణా రివర్ బోర్డు కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేసేందుకు సీఎంతో చర్చిస్తా
- అవుట్‌సోర్సింగ్ విధానంలో లస్కర్ల నియామకం
- జిల్లా నీటిపారుదల సలహామండలి సమావేశంలో తీర్మానాలు
- పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యేలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర , చిత్రంలో కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లాలోని రైతులకు ఉపయోగపడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా నీటిపారుదల సలహామండలి సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పట్టిసీమ ద్వారా నీటిని తీసుకువచ్చి తాగునీరు, సాగునీరుకు చర్యలు చేపడుతున్నారన్నారు. గత ప్రభుత్వం సాగునీటి కాలువలు, డ్రెయిన్ల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పులిచింతలలో డెడ్ స్టోరేజ్ కంటే పడిపోయిందని, ఈ పరిస్థితుల్లో సాగునీటి అవసరాల కోసం పట్టిసీమ ద్వారా 20 పంపులతో 7 వేల క్యూసెక్కుల వరకు నీటిని తీసుకువచ్చామన్నారు. సాగునీటి కాలువలు, డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులకు నిధులు మంజూరు చేశామని, శివారు ప్రాంతాల వరకు నీరు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఇవీ తీర్మానాలు...

సమావేశంలో కృష్ణా డెల్టా సాగునీటి అవసరాల కోసం 10 వేల క్యూసెక్కుల నీరు అవసరం అవుతుందని, కృష్ణా డెల్టా మేనేజ్‌మెంట్ బోర్డు ద్వారా నాగార్జునసాగర్ నుంచి 10 టీఎంసీల నీరు విడుదలయ్యేలా చర్యలు చేపట్టడం, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని, డెల్టాలో అవుట్‌సోర్సింగ్ ద్వారా లస్కర్లను నియమించాలని, గన్నవరం నియోజకవర్గంలో పోలవరం కుడికాలువ ఏలూరు కాలువ అనుసంధానానికి రివైజ్డ్ ప్రతిపాదనల ద్వారా వచ్చిన మొత్తం రూ.32.10 కోట్లకు వెంటనే టెండర్లు పిలవాలని సమావేశంలో తీర్మానించారు.

సరిగా పనులు చేయకపోతే బ్లాక్‌లిస్టులో...

కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ డ్రెయిన్లు, కాలువల్లో పూడికతీత పనులకు సంబంధించి అంచనాల్లో రూపొందించిన పనులను తప్పనిసరిగా చేయించాలని, అలా చేయని వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. ఈ పనుల నిర్వహణపై తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పనులు, ఎం–బుక్, రైతులతో మాట్లాడతానని చెప్పారు.



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

- అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తమ నియోజకవర్గానికి 1000 క్యూసెక్కుల నీరు అవసరం ఉందన్నారు. అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు లేక నియోజకవర్గ పరిధిలో 5 వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. మోపిదేవి నుంచి విజయవాడ కరకట్ట రోడ్డు దెబ్బతిందని దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు.
- కైకలూరు శాసనసభ్యుడు కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కాలువల్లో నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని నియోజకవర్గ పరిధిలో 1.08 లక్షల ఎకరాలు సాగవుతున్నాయని, రైతులకు నీరు అందించకపోతే ఇబ్బందులు పడతామన్నారు. గుర్రపుడెక్క తొలగించేందుకు కాంట్రాక్టర్లు 50 నుంచి 40 శాతం లెస్‌కు టెండర్లు వేస్తున్నారని ఇలాంటి పనులు చేస్తే విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయాల్సి వస్తుందన్నారు.
- పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని కృత్తివెన్ను మండలంలోని శివారు ప్రాంతాలకు నీరు లేకపోవటంతో రైతులకు సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. బంటుమిల్లి కెనాల్ ద్వారా 900 క్యూసెక్కులు విడుదల చేస్తే గాని శివారు ప్రాంతాలకు నీరు అందదన్నారు.
- పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డీసిల్టేషన్ పనులు జరగకపోవటం వల్లే సాగునీరు పారుదల సక్రమంగా ఉండటం లేదన్నారు. అయినంపూడి, కొమరవోలు ప్రాంతాల్లోని రైతులు దీని వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు.
- తొలుత ఇరిగేషన్ ఎస్‌ఈ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 10 వేల క్యూసెక్కుల నీరు అవసరమవుతాయని, ప్రస్తుతం పట్టిసీమ ద్వారా 7వేల క్యూసెక్కులు విడుదల చేయగా బ్యారేజ్‌కు 4 వేల క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయన్నారు. మున్నేరు, పాలేరు నుంచి మరో 4 వేల క్యూసెక్కులు రానున్నాయని వీటితో పాటు సాగర్ నుంచి 10 టీఎంసీల నీరు వస్తే ఈ వ్యవసాయ సీజన్‌కు నీరు సరిపోతుందని వివరించారు.

సమావేశంలో నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారులతో పాటు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ డీకే బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఎంపీ నిధులు, సీఎస్‌ఆర్, ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం సాయంత్రం జేసీ గీతాంజలిశర్మతో కలిసి వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కమ్యూనిటీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, వంతెనల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు మొదలుపెట్టకపోతే వెంటనే ప్రారంభించాలన్నారు. పనులు పూర్తి చేసేందుకు నిధులు అందుబాటులో ఉన్నాయని, నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనులు చేపట్టడం ఎంత బాధ్యతో అంతే బాధ్యతగా బిల్లులు రూపొందించి సకాలంలో చెల్లింపులు చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ విజయకుమారి, మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, బాలసుబ్రహ్మణ్యం, జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి టి.శివప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, సీపీవో గణేష్‌కృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గిరిజన యువతకు జాబ్‌మేళా

భవానీపురం(విజయవాడపశ్చిమ): గిరిజన యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (టీటీడీసీ) కార్యాలయంలో నిర్వహించనున్న జాబ్ మేళాలో అర్హత కలిగిన గిరిజన యువతీ, యువకులకు ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్ - అన్‌లోడింగ్ వంటి ఉద్యోగాల్లో అవకాశం కల్పిస్తామని తెలిపారు. వారానికి ఐదు రోజుల షిఫ్టుల వారీగా పని చేయాల్సి ఉంటుందని, నెలకు రూ.17వేలు జీతం, పీఎఫ్, ఈఎస్ఐ, మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యంతోపాటు అదనపు పనికికూడా వేతనం ఇస్తారని పేర్కొన్నారు. పదో తరగతి లేదా ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణులై ఇంగ్లిష్ చదవడం, రాయడంలో నైపుణ్యమున్న గిరిజన యువతీ యువకుల కోసం సికింద్రాబాద్‌కు చెందిన ఎస్‌కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేఎల్ గ్రూప్ సౌజన్యంతో జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆమె వివరించారు. ఆసక్తిగల గిరిజన యువత బయోడేటాతోపాటు 10వ తరగతి లేదా ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో 31వ తేదీ (బుధవారం) ఉదయం 10 గంటలకు విజయవాడ సమీపంలో గొల్లపూడిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 78937 51698 నంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ సృజన ప్రకటనలో పేర్కొన్నారు

ఆషాఢ కృత్తిక మహోత్సవాలు



మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. చివరిరోజు మంగళవారం ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్‌శర్మ బ్రహ్మత్వంలో అష్టోత్తరం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించారు. అమ్మవార్లు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫుడ్‌కోర్ట్‌లో తమ్ముళ్ల దందా

- జనరేటర్లతో స్టాల్స్‌కు విద్యుత్ సరఫరా
- ఒక్కో షాపు నుంచి రోజుకు రూ. 300 వసూలు
- స్టాళ్లను రద్దు చేయిస్తామంటూ బెదిరింపులు



విజయవాడలోని ఈట్‌స్ట్రీట్

సాక్షిప్రతినిధి,విజయవాడ: నగరంలోని ఫుడ్‌కోర్ట్‌లో తెలుగుతమ్ముళ్లు దందా చేస్తున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన ఈట్ స్ట్రీట్ పేరుతో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్ట్‌పై టీడీపీ కూటమి నేతలు పెత్తనం చెలాయిస్తున్నారు. అధికారం వచ్చినప్పటి నుంచి ఫుడ్ కోర్టులోని చిరు వ్యాపారులను రకరకాలుగా వేధిస్తున్నారని తెలుస్తోంది. షాపులు రద్దు చేయిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలిచిన వ్యక్తి అనుచరులు ఫుడ్ కోర్ట్‌లో 'జనరేటర్లు' ఏర్పాటు చేసి సరికొత్త దందాకు తెరలేపారు. వ్యాపారుల నుంచి రోజుకు రూ. 30 వేలు వసూలు చేస్తున్నారు. మంచినీళ్ల వ్యాపారం తూర్పు నియోజకవర్గానికి చెందిన మరో నేత కనుసన్నల్లో సాగుతోంది.

132 మందికి కార్డులు

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద కార్పొరేషన్ ఆధ్వర్యాన 2022లో ఈట్ స్ట్రీట్ పేరుతో ఫుడ్ కోర్టు ఏర్పాటైంది. గతంలో ఫుడ్ కోర్టుకు ఆధునిక హంగులు సమకూర్చారు. రూ.1.40 కోట్లు వెచ్చించి వీధి దీపాలు, పేవర్ బ్లాక్‌లు, కాలువలపై బెంచీలు ఏర్పాటు చేశారు. మొత్తం 132 మంది చిరువ్యాపారులకు వీఎంసీ కార్డులు జారీ చేసింది. ప్రస్తుతం ఫుడ్ కోర్టులో రోడ్డుకు ఇరువైపులా 100 దుకాణాల్లో వ్యాపారం చేస్తున్నారు. రాత్రి 9 గంటల నుంచి ఇక్కడ వ్యాపార లావాదేవీలు కొనసాగుతాయి. రాత్రి పూట వ్యాపారం కావడంతో స్టాల్స్ నిర్వాహకులు కొందరు స్టేడియం కాంప్లెక్స్‌లోని దుకాణాల నుంచి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు చార్జింగ్ లైట్లు, బ్యాటరీలతో వ్యాపారం చేస్తున్నారు.



ఈట్ స్ట్రీట్‌లో ఓ చివరపెట్టిన జనరేటర్

కనెక్షన్లు తీసుకోకుంటే స్టాళ్ల రద్దంటున్నారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై అధికార పార్టీ నేతలు కన్ను వేశారు. ఫుడ్‌కోర్ట్‌లో రెండు పెద్ద జనరేటర్లు ఏర్పాటు చేసి దందాకు తెరలేపారు. తమ జనరేటర్ల నుంచే స్టాల్స్‌కు కనెక్షన్ తీసుకోవాలని, లేని పక్షంలో స్టాల్స్‌ను రద్దు చేయిస్తామంటూ బెదిరింపులకు దిగారు.

100 స్టాళ్ల నుంచి రోజుకు రూ.300

ఇప్పటికే స్టాళ్ల నిర్వాహకులకు మినీ జనరేటర్లు ఉన్నా వాటిని వినియోగించడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. ఒక్కోస్టాల్ నుంచి రోజుకు రూ.300 చొప్పున వసూలు చేస్తున్నారు. 100 స్టాల్స్ నుంచి రోజుకు రూ. 30 వేలు వసూలు చేస్తున్నారు. కాంప్లెక్స్‌లోని దుకాణాల నుంచి కరెంట్ తీసుకుంటే కనెక్షన్ కట్ చేయాలంటూ విద్యుత్ అధికారులను పురమాయిస్తున్నారు. రాత్రంతా శ్రమ పడి వ్యాపారం చేసినా మిగిలేది లేదని, జనరేటర్‌కే రోజుకు రూ. 300 చెల్లిస్తే తమ జీవనం ఎట్లా అని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

వాటర్ క్యాన్లు ఆయన వద్దే కొనుగోలు చేయాలట

తూర్పు నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ నాయకుడు మినరల్ వాటర్ సప్లై చేస్తున్నాడు. స్టాల్స్ నిర్వాహకులు మొత్తం తన వద్దే వాటర్ క్యాన్లు కొనుగోలు చేయాలని దందా ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న షాపులన్నిటి వద్ద తన వాటర్ క్యాన్లు మాత్రమే వేసుకోవాలని , లేని పక్షంలో షాపులు ఉండవని చిరు వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశాడు.

టీడీపీ నేత ప్రధాన అనుచరుడిదే దందా



స్టేడియం గ్రౌండ్స్‌లో ఉన్న జనరేటర్

ఇటీవల ఎన్నికల్లో గెలిచిన టీడీపీ నేత ప్రధాన అనుచరులు ఇద్దరు ఈ దందా కొనసాగిస్తున్నారు. చిరు వ్యాపారులు ఎవరైనా ప్రశ్నిస్తే విషయం ' రవి' అన్న వరకు వెళ్తుంది జాగ్రత్త అంటూ బెదిరిస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. ఎన్నికల్లో గెలిచిన టీడీపీ నేత తనయుడు అండదండలతోనే దందా సాగుతోందని చెబుతున్నారు. ఓ స్టాల్ నిర్వాహకుడు కాంప్లెక్స్‌లోని దుకాణం నుంచి కరెంట్ కనెక్షన్ తీసుకున్నాడు. ఇది తెలిసిన టీడీపీ నేతలు విద్యుత్‌శాఖ అధికారులను పంపి కనెక్షన్ కట్ చేయించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందించి ఫుడ్ కోర్టులో చిరువ్యాపారాలు చేసుకునే వారికి విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకొని జనరేటర్ల దందాను అరికట్టాలని కోరుతున్నారు.

నాయీ బ్రాహ్మణులను ఆదుకోండి

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముషిడిపల్లి రమణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులను అన్ని విధాల ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముషిడిపల్లి రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ కేటాయించాలన్నారు. దేవాలయాల్లో వాయిద్య వృత్తి చేస్తున్న వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్పొరేట్లు సెలూన్లు, పార్లర్లు, స్పాలు ఏర్పాటు చేసి క్షౌర వృత్తిని దెబ్బతీస్తున్నారని, ఇతరులు ఎవ్వరూ వీటిని నెలకొల్పకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో బీసీ కార్పొరేషన్ ద్వారా పట్టణాల్లో రూ. 20 నుంచి రూ. 30 లక్షల రుణాలు ఇప్పించాలన్నారు. నాయీ బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్యకు రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఆర్థిక సాయం చేయాలన్నారు. ఆలయ ట్రస్టు బోర్డుల్లో చైర్మన్లు, డైరెక్టర్లుగా నాయీ బ్రాహ్మణులను నియమించాలన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పుల్లయ్య, నల్లవరపు నరసింహారావు, జగన్నాథం, అప్పారావు పాల్గొన్నారు.

నీటి పరీక్షలపై సంతృప్తి

వీరులపాడు: పొన్నవరం, తిమ్మాపురం గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కార్యక్రమంలో భాగంగా జాతీయ జల్ జీవన్ మిషన్ సభ్యులు ముసలిరెడ్డి, భరత్ మంగళవారం పర్యటించారు. నీటి నాణ్యత, పీహెచ్, క్లోరిన్ పరీక్షలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రసాద్, ఏఈ కృష్ణకిషోర్, జేజేఎం జిల్లా కోఆర్డినేటర్ సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. నగరంలోని హిందూ కళాశాలలోని దైత శ్రీరాములు ఆడిటోరియంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యాన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి రవీంద్ర జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, సంస్థ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యం చేస్తే సహించేది లేదని సీఎం చంద్రబాబునాయుడు హెచ్చరించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా మానవ అక్రమ రవాణా జరక్కుండా అన్ని నివారణ చర్యలు గట్టిగా తీసుకుంటున్నామన్నారు. నిర్భయ, దిశ చట్టాలు వచ్చినా మహిళలపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. జడ్జి కేవీ రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థినులు తాత్కాలిక ప్రలోభాలకు లోనుకాకుండా, మానవ అక్రమ రవాణా బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికైనా హక్కులు భంగం వాటిల్లితే ఏమైనా అవసరం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 15100 కాల్ చేయాలన్నారు. డీసీపీఓ మోనిషా మాట్లాడుతూ బాలలు ఎవరైనా తప్పిపోతే 1098 హెల్ప్ లైన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు, డీఎస్పీ నాగరాజు, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ రావు, ఐసీడీఎస్ పీడీసీ సువర్ణ, డీసీపీఓ మోనిషా, డీఈవో తహేరాసుల్తానా, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు అలవాటు పడిన యువకుడి ఆత్మహత్య



పెనమలూరు: మత్తు పదార్థాలకు బానిసగా మారిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కానూరుకు చెందిన కస్తూరి రామకృష్ణ భార్య ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. అతను కూలీ పనులు చేస్తాడు. అతని కుమారుడు రత్నాకర్ (24) మత్తు పదార్థాలకు అలవాటు పడ్డాడు. ఈ నెల 29వ తేదీ రాత్రి రత్నాకర్ ఇంటికి వచ్చి తనకు ఐఫోన్ కొనాలని కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ఇంట్లో సామాను పగలకొట్టాడు. కుటుంబ సభ్యులు భయంతో బంధువు ఇంటికి వెళ్లి ఆ రోజు రాత్రి నిద్రపోయారు. మంగళవారం వేకువజామున తండ్రి రామకృష్ణ తన కుమారుడు రత్నాకర్ ఇంట్లో ఏమి చేస్తున్నాడో చూడటానికి వెళ్లాడు. రత్నాకర్‌ను పిలవగా పలకలేదు. తలుపులు వేసి ఉండటంతో పగల కొట్టి తెరిచారు. ఇంట్లో రత్నాకర్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. తన కుమారుడు మత్తు పదార్థాలకు బానిసగా మారడంతో ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అవినీతి 'రాజా'.. అబద్ధాలు కట్టిపెట్టు

- పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- యాభై రోజుల్లోనే ఎమ్మెల్యే వర్లకు అవినీతి మరకలు
- తనను విమర్శించే అర్హత లేదని మండిపాటు



వల్లూరుపాలెంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: అధికారం వచ్చి యాభై రోజులు కూడా గడవక ముందే అవినీతి బాట పట్టిన పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అబద్ధపు ఆరోపణలు కట్టి పెట్టాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హితవు పలికారు. వల్లూరుపాలెంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిమ్మకూరులో యాభై లక్షల మట్టి, కోడూరులో కోటి రూపాయల మట్టి అమ్ముకున్న ఘనత కుమార్‌రాజాదేనని కైలే ఆరోపించారు. తనపై చేసిన ఆరోపణలు నిజమని నమ్మితే ఎమ్మెల్యే వర్ల అధికారంలో ఉన్నారని, తాను ఏ విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరారు. పాములలంక వంతెనకు కనీసం శంకుస్థాపన కూడా చేయలేదని, కానీ 40 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పడం ప్రజలను మోసగించడం కాదా అని అనిల్‌కుమార్ ప్రశ్నించారు. అభివృద్ధి పనులు పక్కన పెట్టి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం తప్ప సాధించేదేమీ లేదని చెప్పారు. తాను ఇళ్లస్థలాలు ఇవ్వలేదని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. తన వెంట వస్తే ఎక్కడెక్కడ ఇళ్లస్థలాలు ఇచ్చింది చూపిస్తానని కైలే పేర్కొన్నారు.

చేతులెత్తేసిన చంద్రబాబు

సంక్షేమ పథకాలు అమలు చేయలేక సీఎం చంద్రబాబు చేతులెత్తేశారని, హోం మంత్రి అనిత ఏం మాట్లాడుతున్నారో ఆమెకే తెలియదని అనిల్ కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం 50 రోజుల పాలనలో చిరు ఉద్యోగుల పొట్ట కొట్టడం తప్ప సాధించింది ఏమీ లేదన్నారు. ఎమ్మెల్యే కుమార్‌రాజా యాభై రోజుల్లోనే ఇంత అవినీతి చేస్తే రానున్న ఐదేళ్లలో ఇంకెంత చేస్తాడోనని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు తొందరలోనే ఉందని హెచ్చరించారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, పెనమకూరు సర్పంచ్ నందేటి గంగాభవాని, పార్టీ జిల్లా నాయకుడు గవాస్కర్‌రాజు, ఎంపీటీసీ మరీదు మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ఆత్మహత్యాయత్నం

కోనేరుసెంటర్(మచిలీపట్నం): స్థానికంగా ఓ లాడ్జిలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పెడన మండలం లంకల కలవగుంట గ్రామానికి చెందిన జోగి నాగవరప్రసాద్, హైదరాబాద్‌కు చెందిన చంద్ర సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. కొంతకాలంగా వేరే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి భాగస్వామ్యంతో సీఫుడ్స్‌ను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే వ్యాపారాన్ని ప్రారంభించారు. కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు వస్తున్నాయి. దీంతో ఆందోళన చెందిన ఇద్దరు మిత్రులు ఈ నెల 29వ తేదీన మచిలీపట్నంలోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అపస్మారస్థితికి చేరిన వారిని లాడ్జి బాయ్ గుర్తించి లాడ్జి నిర్వాహకులకు చెప్పాడు. లాడ్జి నిర్వాహకులు ఇద్దరు మిత్రులను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారు ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. మూడో వ్యక్తి వ్యాపారంలో మోసం చేయడంతో నాగవరప్రసాద్, చంద్ర ఆత్మహత్యకు యత్నించారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ ఘటనపై ఫిర్యాదు అందని కారణంగా కేసు నమోదు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై ఎస్ఎన్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలోని బొగ్గులైన్ క్వార్టర్స్ వద్ద ఓ వ్యక్తి తలకు గాయాలతో రక్తపుమడుగులో మరణించి కనిపించాడు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఎన్ పురం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని వయస్సు సుమారు 40నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతుడి పక్కన చిత్తకాగితాల సంచి ఉండటంతో కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తూ ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు తీవ్ర గాయాలై మరణించి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలింగ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం పోలీస్‌లకు లభ్యమైంది. ఎన్టీటీపీఎస్ కాలువ స్టేజ్-2 గేట్ వద్ద మృతదేహాన్ని గుర్తించిన సంస్థ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయస్సు 25-30 ఏళ్ల మధ్య ఉంటుంది. ఎత్తు 5.6 అడుగులు, నలుపు రంగుపై తెలుపు రంగు బొమ్మ ఉన్న ఫుల్‌హ్యాండ్ టీషర్ట్, వెలసిన నీలం రంగు ప్యాంటు, బ్లాక్‌కలర్ ఫుల్‌డ్రాయర్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 9440627084, 93906 81266 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ ఎం.సత్యనారాయణ సూచించారు.

దంపతుల మధ్య తగాదా.. భర్త బలవన్మరణం

పెనమలూరు: భర్త దురలవాట్ల కారణంగా దంపతుల మధ్య గొడవ జరగటంతో భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇంద్రకీలాద్రినగర్ హోసన్న మందిరం ప్రాంతానికి చెందిన కొమరవల్లి సురేంద్రబాబు (25) ఆటోడ్రైవర్. అతను ఆరేళ్ల క్రితం ప్రియాంకను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ విషయంలో భార్యభర్తలకు గొడవ జరుగుతోంది. వారం క్రితం భర్త మద్యం సేవించి భార్యతో గొడవ పడటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలకు కౌన్సెలింగ్ చేశారు. అయినా అతని వైఖరిలో మార్పు రాలేదు. మళ్లీ మద్యం సేవించసాగాడు. ఈ నెల 28వ తేదీ రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో.. భార్య పిల్లలతో పుట్టింటికెళ్లిపోతానని తెలిపింది. దీంతో సురేంద్రబాబు ఇంట్లో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర చికిత్స కోసం చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న సురేంద్రబాబు మంగళవారం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చేతబడి నెపంతో మహిళకు భర్త వేధింపులు

- విచక్షణారహితంగా కొట్టి చీకటి గదిలో బంధించిన వైనం
- భర్తతో పాటు అత్తింటివారి వేధించారు
- పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసిన బాధితురాలు

కోనేరుసెంటర్: చేతబడులు చేస్తున్నావంటూ కట్టుకున్న భార్యను ఓ ప్రబుద్ధుడు చిత్రహింసలు పెట్టాడు. అతనితో పాటు అత్తింటివారు ఆమెను శారీరకంగా మానసికంగా వేధించి, చిత్రహింసలకు గురి చేశారు. వీటిని భరించలేని బాధితురాలు ఎట్టకేలకు పోలీసులను ఆశ్రయించింది. వారు బాధితురాలి నుంచి ఫిర్యాదు అందుకుని భర్తతో పాటు అతని కుటుంబసభ్యులపై మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం బ్రహ్మపురానికి చెందిన సూదాబత్తుల ముఖర్జీ విజయవాడకు చెందిన లాస్య భార్యాభర్తలు. ఆమె నిత్యం ఆధ్యాత్మిక చింతనలో ఉంటుంది. దీంతో అతను తన భార్య క్షుద్రపూజలు చేస్తోందంటూ అనుమానం పెంచుకున్నాడు. భర్తతో పాటు మామ, తోడికోడలు, మరిది, అతని స్నేహితుడు కలిసి లాస్యను వేధిస్తున్నారు. వీరి శాడిజం మరింత పెరిగింది. భర్త కటింగ్‌బ్లేడుతో ఆమె పళ్లను బలవంతంగా లాగడానికి ప్రయత్నించాడు. ఆమె దంతాలు కదిలి తీవ్రరక్తస్రావం కావడంతో ఇంట్లోని ఓ చీకటి గదిలో బంధించారు. 12 గంటల పాటు గదిలో బంధించడంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. కొద్దిగా ఓపిక తెచ్చుకున్న ఆమె.. సోదరుడికి ఫోన్ చేయగా అతను లిఫ్ట్ చేయకపోవడంతో లాస్య సోదరి భర్తకు ఫోన్‌లో విషయం చెప్పి బోరున విలపించింది. అతను ఆమె సోదరుడికి సమాచారం ఇవ్వడంతో డయల్ 100కు ఫోన్ చేసి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లాస్య సోదరుడు మూడు రోజుల క్రితం మచిలీపట్నానికి వచ్చి ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న లాస్య వద్దకు వచ్చిన ముఖర్జీ ఆమెను బుజ్జగించి అదే రోజు ఇంటికి తీసుకెళ్లి ఆమెను మళ్లీ హింసించడం మొదలుపెట్టాడు. భర్తతో పాటు అత్తింటివారు పెడుతున్న హింసపై బాధితురాలు మంగళవారం లాయర్ సాయంతో చిలకలపూడి పోలీసులను ఆశ్రయించి జరిగిన ఘోరాన్ని వివరించింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ఘంటసాలలో అగ్నిప్రమాదం

- విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో నాలుగు పూరిళ్లు దగ్ధం
- రూ.3 లక్షల ఆస్తినష్టం



ఘంటసాల ఎస్టీ కాలనీలో అగ్నికి ఆహుతైన గృహాలు, వంటసామగ్రి

ఘంటసాల: ఘంటసాల ఎస్టీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు పూరిళ్లు కాలి బూడిదవ్వగా కట్టుబట్టలతో ఆ కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. ఘంటసాల సంతమార్కెట్ వెనుక ఎస్టీ కాలనీలో ఒంటి నిట్టాడి ఇళ్లు, తాటాకు పాకలు వేసుకుని అమృత నాంచారమ్మ, బుడ్డిమ్మ, వెంకమ్మ, ఏసు జీవిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి నాంచారమ్మ ఇంటిలో మంటలు చెలరేగాయి. వాటిని గుర్తించే లోపే అగ్నికీలలు నాలుగిళ్లను చుట్టుముట్టాయి. అవి తాటాకు ఇళ్లు కావడంతో క్షణాల్లో కాలి బూడిదయ్యాయి. వారంతా కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. స్థానికులు మంటలను అదుపుచేయడానికి ప్రయత్నించారు. వారు మొవ్వ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితులు చెప్పారు. వీరిని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి మా కుటుంబాలను ఆదుకోవాలని బాధితులు విన్నవించుకుంటున్నారు.